క్లుప్తంగా

4న సీపీఎం మండల మహాసభ

పాన్‌గల్: మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 4వ తేదీన సీపీఎం 8వ మండల మహాసభ నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మండల మహాసభలో మండల నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మండల మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

క్రీడాకారులకు సామగ్రి వితరణ



వీపనగండ్ల: మండల కేంద్రంలో దీపావళి గంగమ్మ జాతర సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలో పాల్గొనే మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులకు శనివారం గ్రామానికి చెందిన ముంత మల్లయ్య యాదవ్, శివయాదవ్ క్రీడా సామగ్రిని వితరణగా అందజేశారు. 24 మంది క్రీడాకారులకు అవసరమైన వస్తువులు అందజేయడంపై క్రీడాకారులు తమ అభినందనలు తెలియజేశారు.

రూ.10 నాణేలపై అవగాహన కల్పించండి



వీపనగండ్ల: రూ.10 నాణేలను గ్రామాల్లోని కిరాణదారులు పరిగణలోకి తీసుకోకపోవడంతో పలువురు ఇబ్బందులకు గురి అవుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బ్యాంకు అధికారులు ఇచ్చిన రూ.10 నాణేలను వ్యాపారస్తులు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. బ్యాంకు, ప్రభుత్వ అధికారులు ఈ నాణేలపై వ్యాపారస్తులకు అవగాహన కల్పించడంతో పాటు తీసుకోవడానికి నిరాకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల స్థలాల పరిశీలన



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ గ్రామంలో సుమారు 45 ఏళ్ల క్రితం పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను శనివారం తహసీల్దార్ సుగుణ పరిశీలించారు. ఈ స్థలంలో గత ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించిందని తహసీల్దార్ తెలిపారు. కాగా ఈ ఇళ్లల్లో గ్రామానికి చెందిన వారు కాకుండా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నివాసముంటున్నారని, గ్రామానికి చెందిన కొందరు నాయకులు తమ ఇష్టానుసారంగా ఇళ్లలో నివాసం ఉండవచ్చని తమకు నచ్చిన వారిని ప్రోత్సహిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ చెప్పారు. కలెక్టర్ సూచనల మేరకు శనివారం గ్రామానికి వెళ్లి పరిశీలించామన్నారు. అక్కడ ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదన్నారు. ఒక్కరు మాత్రమే ఓ ఇంటిలో నివాసం ఉన్నారని చెప్పారు. నివాసం ఉన్న వ్యక్తిని కలిసి మూడు రోజుల్లోగా ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని సూచించామన్నారు. పూర్తి స్థాయి నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు పుల్లూరు విద్యార్థి

అలంపూర్: ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన సోమేశ్వరి, నాగార్జున్ దంపతుల కుమార్తె మధుప్రియ గట్టు మండలంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల విభాగంలో అక్టోబర్ 19వ మహబూబ్‌నగర్ జిల్లాలోని వేములలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. పెద్దపల్లి జిల్లా గోదారిఖనిలో అక్టోబర్‌లో 28 నుంచి 30 వరకు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో 3వ స్థానం దక్కించుకుంది. దీంతో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ బలేరిలో జరిగే 68వ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థిని మధుప్రియను, తల్లిదండ్రులు సోమేశ్వరి, నాగార్జున్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, ప్రిన్సిపల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ అనూష, పీఈటీలు సునీత, ప్రియాంక, కోచ్‌లు సింధురాణి, సతీష్ తదితరులు ఉన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు



కొత్తకోటలో మహిళా సంఘాల సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: రైతులు కష్టపడి పండించిన వరిధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని కానాయపల్లి, వడ్డెవాటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించిన ప్రతిగింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం ఏ గ్రేడ్‌కు రూ.2,320, బీ గ్రేడ్ రూ.2,300, సన్న రకానికి అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. గత ప్రభుత్వం రైతులకు రావాల్సిన సబ్సిడీలను అందించలేదని, వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారని, తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేశారని మండిపడ్డారు. గత పాలకులు చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతూనే, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 22లక్షల మంది రైతులకు రూ.18వేల కోట్లు రుణమాఫీ చేసి చూపించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలోని ప్రొఫెసర్ జయశంకర్ సమావేశ మందిరంలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు మంజూరైన రూ.1.2కోట్ల చెక్కులను సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రావుల సురేంద్రనాథ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రావుల జితేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ పీజే బాబు, డీఆర్‌డీఓ ఉమాదేవి, ఎంపీడీఓ చెన్నమ్మ, ఎంపీఓ రాములు, బోయేజ్, పి.కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, చర్లపల్లి శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి..

ఇందిరా మహిళశక్తి పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం మహిళాశక్తి పథకం ద్వారా చేయూతనిచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. మహిళ ఇందిరా శక్తి పథకంలో పెరటికోళ్ల పెంపకం, ఇందిరా డైరీ, మిల్క్ పార్లర్లు, మహిళా క్యాంటీన్ తదితర పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

ప్రభుత్వ సాయం..

మండలంలోని సత్యహళ్లికి చెందిన కుర్మన్న కొంత కాలంగా గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. 2023లో పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో మొక్కలు తీసుకొచ్చేందుకు పాలెం గ్రామానికి వెళ్తుండగా ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ఉపాధి హామీ నిధుల నుంచి మంజూరైన రూ.2లక్షల ప్రొసీడింగ్‌ను ఎమ్మెల్యే మృతుడి కుమార్తె ప్రవంతికి అందజేశారు.

రైతులు ఇబ్బంది పడొద్దు..

మదనాపురం: మార్కెట్ యార్డులో శనివారం రాత్రి ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు జగదీశ్, టీసీ నాగన్నయాదవ్, వెంకట్ నారాయణ, సాయిబాబా, శ్రీధర్‌రెడ్డి, వడ్డె కృష్ణ, హనుమాన్‌రావు, మహేష్, రామకృష్ణ, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం

- పాఠశాలకు రూ.2లక్షల విలువైన సామగ్రి వితరణ



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి వెంకట్రాములు

ఆత్మకూర్: తాను చదివిన పాఠశాలకు మంచి చేయాలని పరితపించిన పూర్వ విద్యార్థి.. ఉద్యోగరీత్యా ఇతర రాష్ట్రాల్లో స్థిరపడినా శనివారం పాఠశాలకు చేరుకుని రూ. రెండు లక్షల విలువ చేసే సామగ్రిని అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నాడు. 1989–90లో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన వెంకట్రాములు ప్రస్తుతం బెంగళూరులో కెనరా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్నారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్రాములు మాట్లాడుతూ.. తాను ఇక్కడే అసౌకర్యాల మధ్య కష్టపడి చదువుకున్నానని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎందరో ఉన్నత శిఖరాలను అధిరోహించారని, విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఈసందర్భంగా ఎంఈఓలు కొండాపురం బాలరాజు, భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వెంకట్రాములును ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. రూ.రెండు లక్షలతో డ్యూయల్ డెస్క్ బెంచీలు, టేబుళ్లు, కుర్చీలు, కంప్యూటర్లు, ఇతర సామగ్రిని విద్యార్థుల సౌకర్యార్థం అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకట్రాములురావు, బాబుదేవిదాస్‌రావు, గోపాల్‌రెడ్డి ని ఘనంగా సత్కరించారు.

గంగమ్మ తల్లికి ఆభరణం బహూకరణ



ఆభరణాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామ పెద్దలు

వీపనగండ్ల: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరను పురస్కరించుకొని గంగమ్మ ఆలయంలో వెలసిన గంగమ్మ తల్లికి గ్రామస్తులు, పెద్దలు సమకూర్చిన ఆభరణాన్ని శనివారం గ్రామ రైతు కమిటీ నాయకులు అమ్మవారికి అలంకరించారు. దాదాపు రూ.60 వేలు వెచ్చించి తయారు చేయించిన 56 తులాల వెండి ఆభరణాన్ని అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు కమిటీ అధ్యక్షుడు పోతుల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముంత కృష్ణయ్యయాదవ్, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, గ్రామ పెద్దలు ఎత్తం కృష్ణయ్య, ముంత మల్లయ్య, రవీందర్‌రెడ్డి, ఎత్తం బాలస్వామి, తెలుగు నర్సింహ, ఆవుల నారాయణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

మదనాపురం: ఎన్‌పీఆర్‌డీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగుల సమస్యలపై తహసీల్దార్ అబ్రహంలింకన్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో చాలా మంది దివ్యాంగులు సమస్యలతో సతమతమవుతున్నారని, ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ సభ్యులు చెన్నయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. మహిళా దివ్యాంగులపై లైంగిక వేధింపులు అరికట్టాలని, ప్రైవేట్ రంగంలో 5 శాతం ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 40 శాతం వికలత్వం ఉన్న ప్రతి ఒక్కరికీ షరతులు లేకుండా రూ.5 లక్షల రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పెదరాయుడు, మన్నెం, పరశురాములు, శాంతన్న, నాగమ్మ, దేవమ్మ, నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్, సీపీఎం మండల కార్యదర్శి వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన శబరికి మాలదారులు



శబరికి కాలినడకన బయలుదేరుతున్న దీక్షాపరులు

ఆత్మకూర్: అయ్యప్పస్వామి సన్నిధికి శనివారం దీక్షాపరులు కాలినడకన పయనమయ్యారు. శనివారం ఆత్మకూర్ శివారులోని మల్లాపురం క్షేత్రంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో మక్తల్‌కు చెందిన గురుస్వామి అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని మూలమళ్లకు చెందిన బాబు గురుస్వామి 14వ సారి కాలినడకన శబరికి బయలుదేరారు. అలాగే ఆత్మకూర్ బీసీకాలనీకి చెందిన బాబుస్వామి మొదటిసారి పాదయాత్రగా అయ్యప్ప సన్నిధికి తరలివెళ్లారు. ఈసందర్భంగా దీక్షాపరులు ఊరి చివర చెరువుకట్ట వరకు పాదయాత్రగా వెళ్తున్న వారిని సాగనంపారు. కార్యక్రమంలో బంగారు భాస్కర్, తోట రవి, బోరింగ్ ఎల్లయ్య, నర్సింహ, దివాకర్, బాలు, భరత్, జిన్నారం శ్రీను, రఘు, అనిల్, గోవర్ధన్, భక్తులు ఉన్నారు.

పారదర్శకంగా కుటుంబ సర్వే



మదనాపురంలో మట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ ప్రశాంత్

ఆత్మకూర్: ప్రభుత్వం ఆదేశాల మేరకు సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి కుటుంబం లెక్క పక్కాగా ఉండాలని పుర కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. శనివారం సిబ్బందితో కలిసి వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న సర్వేకు సహకరించాలని కోరారు. ఆత్మకూర్ మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో 28 బ్లాకులు 5 వేలకు పైగా నివాస గృహాలు, 15వేలకు పైగా జనాభా ఉందని, 31 మంది ఉద్యోగులు సర్వేలో పాల్గొంటున్నారని వివరించారు.

అమరచింత: మండలంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర సర్వేలో భాగంగా ఇంటింటి వివరాల గుర్తింపు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రణాళికతో ముందుకెళ్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 5 వరకు ఇళ్ల వివరాలను గుర్తిస్తూ వార్డుల వారీగా జాబితాలను తయారు చేసి 6 నుంచి సర్వే ప్రారంభిస్తామన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో ఇళ్ల గుర్తిస్తూ.. ఇంటి బయట సమగ్ర సర్వేకు సంబంధించిన స్టిక్కర్ వేస్తున్నామన్నారు.

మున్సిపాలిటీలో..

మున్సిపల్ కేంద్రంలో ఇళ్ల గుర్తింపు కార్యక్రమం పూర్తి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం తెలిపారు.

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పారదర్శకంగా చేయాలని ఎంపీడీఓ గోవింద్‌రావు ఎన్యుమరేటర్లకు సూచించారు. సర్వేలో భాగంగా



నందిమళ్లలో..

శనివారం మండలంలోని వెంగళాయిపల్లి, తెల్లరాళ్లపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇళ్ల జాబితాలు, కుటుంబ వివరాల సేకరణను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు విష్ణు, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: సామాజిక సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగ చేసుకోవాలని, ఇంటికి వచ్చిన అధికారికి పూర్తి వివరాలు తప్పులు లేకుండా అందించాలని మదనాపురం మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ కోరారు. శనివారం మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్ని సామాజిక వర్గాల ప్రజల వివరాలను పొందుపరిచి అందరికీ మేలు జరిగే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జగదీష్, నాయకులు రామకృష్ణ, శేఖర్‌రెడ్డి, మహేష్, కోటేష్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



వెంగళాయిపల్లిలో..



ఆత్మకూర్‌లో..

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస మొదటి శనివారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, నాగరాజుశర్మ, వాల్మీకి పూజారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ సంబురాలను జయప్రదం చేయండి



పాన్‌గల్‌లో చెకుముకి సంబరాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించే చెకుముకి సైన్స్ సంబురాలను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో చెకుముకి సంబురాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ దృక్పథం, శాస్త్ర ప్రచారం పెంపొందించడం బాధ్యతగా స్వీకరించి అవిరళ కృషి చేస్తున్న సంస్థ జన విజ్ఞాన వేదిక అన్నారు. ఈనెల 7వ తేదీన పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 14, 15, 16వ తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సంబురాల్లో పాల్గొనే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ. 5, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు రూ. 10 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. పోటీలకు 8, 9, 10వ తరగతి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల నాయకులు రవికుమార్, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

‘అవినీతి అధికారులను సాగనంపాలి’

ఖిల్లాఘనపురం: స్థానికంగా పనిచేస్తూ జిల్లాకు చెడ్డ పేరు తెస్తున్న అధికారులని సాగనంపాలని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్ అన్నారు. శనివారం ఖిల్లాఘనపురంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో పౌర సరఫరాల శాఖ డీఎంగా పనిచేసిన ఎండీ ఇర్ఫాన్‌ను అక్కడ అవినీతికి పాల్పడితే సస్పెండ్ చేశారన్నారు. అలాంటి అధికారిని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత వనపర్తి జిల్లాకు చెందిన మంత్రి, నియోజకవర్గ ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకుని ఇక్కడ నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లాలో 25 జూలై 2024 నుంచి 27 సెప్టెంబర్ 2024 వరకు పౌర సరఫరాల శాఖలో డీఎంగా విధులు నిర్వహించిన ఆయన తనిఖీల పేరుతో రైస్ మిల్లర్లలను బెదిరించి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. రూ.కోట్లు వసూలు చేసిన డీఎంను ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసిందన్నారు. అలాంటి అవినీతి అధికారిని బదిలీ చేస్తే జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు ఆయనకు అండగా ఉంటూ బదిలీని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పీనానాయక్, మన్యంగౌడ్, గోపాల్, నార్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

వరి కొనుగోళ్లు లేవు..

- గన్నీ బ్యాగులు లేక ఇబ్బందులు
- ప్రారంభమైన వరి కోతలు
- ఆందోళన కలిగిస్తున్న వర్షాలు



రామన్‌పాడులో కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యం

మదనాపురం: మండలంలో వరి కోతలు చేస్తున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు ఇంకా గన్నీ బ్యాగులు కూడా రాకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు వరి ధాన్యం తెస్తున్నారు. మండలంలోని రామన్‌పాడులో సింగిల్ విండో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభించకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులను ఎలాంటి ఇబ్బందులు పెట్టొదని చెబుతున్నా.. అధికారుల నిర్లక్ష్య వైఖరితో లక్ష్యం నీరుగారుతోంది. ఈ విషయమై మండల సమైఖ్య సీసీని వివరణ కోరగా.. గన్నీ బ్యాగులు లేకపోవడం వల్ల కొనుగోలు ప్రారంభించలేదని తెలిపారు. విండో సీఈఓను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

వర్షం వస్తే ఇబ్బందులు..

రైతులు పొలాల నుంచి వరి ధాన్యం తెచ్చి కేంద్రం వద్ద ఆరబోస్తున్నారు. దీంతో వర్షం వస్తే ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు. కష్టపడి పంట పండిస్తే కొనుగోలు సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం సబ్సిడీ టార్పాలిన్లు కూడా ఇవ్వకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. మరో వారం రోజుల్లో వరి కోతలు మరింత పెరగనున్నాయి. వేగంగా కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

మండలంలో వరి పంట వివరాలు ఎకరాల్లో..

అజ్జకొల్లులో 2,768, రామన్‌పాడులో 809, తిరుమలాయపల్లిలో 1,002 అమరావతినగర్‌లో 20, దుప్పల్లిలో 2,254 ద్వారకానగర్‌లో 373, కొన్నూర్‌లో 1,252, నర్సింగాపూర్ 529, నెలివిడిలో 1,116, దంతనూరులో 422, గోపన్‌పేటలో 814, గోవిందహళ్లిలో 441, కరివెనలో 765, కొత్తపల్లిలో 729, మదనాపురంలో 167, శంకరంపేటలో 661 కలిపి మొత్తం 14,146 ఎకరాలు సాగైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుంది



నేను నాలుగున్నర ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. నాలుగు రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి ఆరబెడుతున్నా. ఇప్పటికీ ధాన్యం కొనుగోలు చేయలేదు. మబ్బులు పడుతున్నాయి.. వర్షం వస్తే ధాన్యం పూర్తిగా తడిసిపోతుంది. కొనుగోలు విషయమై ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. మా బాధలను దృష్టిలో పెట్టుకొని సత్వరమే కొనుగోలు చేయాలి.

– మహేశ్వరి, మహిళా రైతు, రామన్‌పాడు